క్లుప్తంగా

ఉచిత ఆరోగ్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: సర్దార్ పటేల్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులు ఉపాధ్యాయులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. సుమారు 150 మందికి పైగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, కంటి పరీక్షలను చేయించామని ఏజీఎం శివరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా డా. సద్గురు, డా సాయికృష్ణ, డా సంధ్య, డా. షాలిని ఉపాధ్యాయులకు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాలిని, ఆర్‌ఐ పద్మజ, కోఆర్డినేటర్స్ మురళీకృష్ణ, శివ, జయపాల్‌రెడ్డి, రాజకుమార్, ప్రిన్సిపాల్ సుభాషిని, డీన్ హరికృష్ణ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో పలు రంగాల్లో ప్రతిభను చాటుతూ పలువురికి స్ఫూర్తి దాయకంగా నిలిచిన 50 మంది మహిళలు వారి అనుభవాలు, ఫొటోలతో రూపొందించిన పుస్తకాన్ని మంగళవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో పవన్ మోటార్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పవన్ మోటార్స్ డైరెక్టర్ కీర్తిరెడ్డి, పుస్తక రచయిత రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పుస్తక రచయిత రమేష్ మాట్లాడుతూ సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా వారు ఎంచుకున్న రంగాల్లో ప్రతిభను కనబరుస్తూ ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. వారి ఎదుగుదలకు తోడ్పాటు అందించివారు, ఎదుర్కొన్న సవాళ్లను ఇతివృత్తంగా తీసుకుని ఈ పుస్తకాన్ని రూపొందించామన్నారు. ఇలాంటి పుస్తకాలు రాబోయే తరానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు.

'రాజకీయ పార్టీలకు ప్రతిపాదనలు పంపాం'

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో వ్యాపార పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయ పార్టీలకు తమ సంస్థ తరఫున అవసరమైన ప్రతిపాదనలు పంపించామని అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (అస్సోచామ్) చైర్మన్ కటారు రవికుమార్‌రెడ్డి తెలిపారు. అసోచామ్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని నొవోటెల్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీ తమ ప్రతిపాదనలు పరిశీలిస్తుందని, ఆ మేరకు మేనిఫెస్టోలో వాటికి ప్రాధాన్యం ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ వ్యాపారవేత్త శ్రీధర్ పిన్నపురెడ్డిని తెలంగాణ రాష్ట్రాభివృద్ధి సమాఖ్య కో చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఓటింగ్ శాతం పెంపే లక్ష్యం



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్

- పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు
- గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరిక
- పోలింగ్ కేంద్రాలు.. సిబ్బంది అంతా సిద్ధం
- మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 26.91 లక్షలు
- పోలింగ్ కేంద్రాలు 2,397.. ఇందులో వెయ్యి క్రిటికల్
- ఎన్నికల నిర్వహణకు 12 వేల సిబ్బంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల్లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతం కంటే ఓటింగ్ శాతం పెంపు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 30 వరకు ఓటు నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల అధికారులు పూర్తి సమన్వయంతో విధుల నిర్వహణకు ఎప్పటికప్పుడు సమీక్షలతో పాటు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మీడియాతో పరిచయ కార్యక్రమంలో భాగంగా ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను వివరించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నవంబర్ 3 నుంచి 15 వరకు నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, ఉపసంహరణ వంటి ప్రక్రియలన్నీ పూర్తవుతాయన్నారు. నవంబర్ 30న ఎన్నికలు, డిసెంబర్ 3 ఓట్ల లెక్కింపు వరకు అవసరమైన చర్యలు, ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలు పక్కాగా..

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని, శాసనసభ ఎన్నికలకు సంబంధించి 16 విభాగాలకు 22 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఐదు నియోజకవర్గాలకు రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్సు బృందాలు, ఎంసీఎంసీ కమిటీ తోపాటు ఇతర కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్లు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రజల ఫిర్యాదుల కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ–విజిల్ యాప్ అందుబాటులో ఉంచామన్నారు. నగదు లావాదేవీలు, డబ్బు, బంగారం వంటివి రవాణా చేసేటప్పుడు ఆధారాలు ఉండాలని, రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్నట్లయితే.. అందుకు తగిన రుజువులు, ధ్రువీకరణ పత్రం జతచేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2050కు ఫోన్ చేయవచ్చునని పేర్కొన్నారు. సీ– విజిల్ 24 గంటలు పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

ఓటర్లు 26.91 లక్షలు.. పోలింగ్ కేంద్రాలు 2,397.. సిబ్బంది 12 వేలు

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 26,91,167 మంది ఓటర్లు ఉన్నారని, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది జాబితాను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఓటరు తుది జాబితా ప్రకారం నియోజకవర్గాల వారిగా మేడ్చల్‌లో 5,95,382 మంది ఓటర్లు ఉండగా, మల్కాజిగిరిలో 4,68,822 మంది, కుత్బుల్లాపూర్‌లో 6,69,253 మంది, కూకట్‌పల్లిలో 4,47,523 మంది, ఉప్పల్ నియోజకవర్గంలో 5,10,167 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో సర్వీస్ ఓట్లు 729 ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 2,397 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 1000 వరకు క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు అంచనా వేశామని, ఈ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు 12 వేల మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

సువిధ యాప్‌తో సభలకు అనుమతులు

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు 'సువిధ యాప్' ద్వారా సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాలు, లౌడ్ స్పీకర్లు, ఇంటింటి ప్రచారం, డిసిప్లే బ్యానర్లు, భారీకేడ్లు, పార్టీలకు చెందిన ఫ్లాగ్‌లకు సంబంధించి అనుమతులు పొందవచ్చని పేర్కొన్నారు. గుర్తింపు పొంది రిజిస్ట్రేషన్ చేసుకున్న పార్టీల నుంచి ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు 'సువిధ యాప్' ద్వారా 48 గంటల్లో అనుమతులు పొందవచ్చన్నారు. ఈ యాప్ అనుమతి పొందిన 72 గంటల పాటు వ్యాలిడిటీ ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేను అఖండ మెజార్టీతో గెలిపించాలి



కేపీహెచ్‌బీ డివిజన్ బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బూత్‌స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే ఎన్నికలకు ప్రతి కార్యకర్త, నాయకుడు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బల్వంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, సాయిబాబాచౌదరి, రాజేష్, వెంకట్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్ డివిజన్ బూత్ కమిటీల సమావేశం



బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో జవహర్‌నగర్, నేతాజీ కాలనీ, తెనుగు బస్తీ, పైపులైన్‌రోడ్డు, హరిజన బస్తీ, సర్దార్‌పటేల్ నగర్, అల్విన్‌కాలనీకి సంబంధించిన 11 బూత్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాన్నారు. అంతేకాకుండా వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావటానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఎంతో దూరదృష్టితో ఎన్నికల మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. మేనిఫెస్టోలో అనేక సంక్షేమ ఫలాలను ప్రకటించటం హర్షణీయమన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కష్టపడాలని కోరారు.

చంద్రప్రకాష్‌రెడ్డికి సన్మానం



బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్‌రెడ్డి సన్మానించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

అల్విన్‌కాలనీ: మేడ్చల్–మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా చంద్రప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ... చంద్రప్రకాష్‌రెడ్డి పార్టీకి అందించిన సేవలను పెద్దలు గుర్తించి ఉపాధ్యక్షుడిగా నియమించటం ఆనందంగా ఉందన్నారు. ఇదే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త పార్టీకి సేవలు అందిస్తే వారికి సముచిత స్థానాలు కల్పిస్తారన్నారు. అనంతరం చంద్రప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయి, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల్లో జిల్లా సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని, వారు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన సెక్టోరియల్ అధికారులతో పాటు ప్రతి నియోజకవర్గానికి సంబంధించి 10 మంది చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చామన్నారు. సెక్టోరియల్ అధికారులు ఎన్నికలకు సంబంధించిన శిక్షణ పొందిన తర్వాత వారు జిల్లాలోని పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల శిక్షణలో ఈవీఎంలపై కూడా అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ అధికారులు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి కేశూరామ్, జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, జెడ్పీ సీఈవో దేవసహాయం, జిల్లాస్థాయి ఎన్నికల శిక్షకులు తిరుమలేష్ పాల్గొన్నారు.

బూత్ కమిటీలు కలిసికట్టుగా పనిచేయాలి



బాలాజీనగర్ డివిజన్ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు ఆదేశాల మేరకు మంగళవారం కేపీహెచ్‌బీకాలనీ, బాలాజీనగర్, శ్రీహరినగర్‌ల బూత్‌లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు మాట్లాడుతూ.. బూత్ కమిటీ సభ్యులు కలిసికట్టుగా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్‌టీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా హస్మత్‌పేటకు చెందిన దండుగుల అశోక్‌బాబు పార్టీ కార్యాలయంలో మంగళవారం దరఖాస్తును అందజేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం వైఎస్ఆర్‌టీపీలో పనిచేస్తున్నానని అన్నారు. క్రియాశీల రాజకీయాలలో ఉంటూ పార్టీ కోసం పని చేస్తున్న తనకు వైఎస్ఆర్‌టీపీ నుంచి టికెట్ కేటాయించాలని కోరారు. వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టా రామ్‌రెడ్డి తన అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని కోరారు.

బతుకమ్మ వేడుకలు







కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో మంగళవారం బతుకమ్మకు మహిళలు భారీ ఎత్తున తరలి వచ్చారు. కూకట్‌పల్లిలోని హనుమాన్‌చౌక్, వెంకట్‌రావు నగర్ కాలనీ, దేవిస్థాన్ హోమ్స్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మలను పెట్టి ఆడి పాడారు. అనంతరం ఐడీఎల్ చెరువులో నిమజ్జనం చేశారు.

మూసాపేట వార్డు కార్యాలయం సమీపంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన







పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత అధికారులపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కూకట్‌పల్లి జేఎన్టీయూలోని పోలింగ్ డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్, రిటర్నింగ్ అధికారి కార్యాలయం, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ అధికారుల సమన్వయంతో ర్యాంప్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ కోసం సరైన విద్యుత్తు సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనల తర్వాత పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో అన్నీ వసతులు ఉన్నాయని ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్‌కు ఎలాంటి అవాంతరాలు జరగకుండా ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రకాశ్, ఈఆర్వో రమేష్, ఎఈఆర్‌ఓలు, వివిధ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



దూరవిద్యా కోర్సుల రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక పోర్టల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కోర్సుల్లో రిజిస్ట్రేషన్ కోసం పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ తెలిపారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఫాలో–ఆన్ కోర్సులలో రిజిస్ట్రేషన్ కోసం ఈ పోర్టల్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఫీజు చెల్లింపు, పోర్టల్ రిజిస్ట్రేషన్ కోసం అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 5 వరకు ఈ పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. 2018 నుంచి వార్షిక, సెమిస్టర్ మోడ్‌ల విద్యార్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చన్నారు. వివిధ కోర్సుల ఫీజు, ఇతర వివరాలన్నీ యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు.

22న నవరాత్రి వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో నవరాత్రి–2023 వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మకుమారీస్ సంస్థ అదనపు పరిపాలనాధికారి రాజయోగిని మోహిని దీదీ, బ్రహ్మకుమారీస్ సంస్థ హైదరాబాద్ సబ్‌జోన్ ఇన్‌చార్జి రాజయోగిని కుల్‌దీప్‌దీదీ పాల్గొంటారు. ఈ సందర్భంగా దేవీ దర్శనం,. ప్రత్యేక ప్రదర్శనలు, మెడిటేషన్ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, దాండియా, గర్బారాస్, బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. వివరాలకై ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

వైభవం.. దేవీశరన్నవరాత్రి ఉత్సవం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనక దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని రకారకాల కూరగాయలు, పండ్లతో అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పూజల అనంతరం ఆలయ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నిమ్మకాలయ నర్సింహ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దండుగుల రమేష్, మక్కాల నర్సింగ్‌రావు, ప్రభు, సందీప్ పాల్గొన్నారు.





హస్మత్‌పేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి దంపతులు

హస్మత్‌పేట చౌరస్తాలో...

హస్మత్‌పేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.



అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ పూజలో రమణ, రవితేజ, భరత్, వేంకటేశ్, పార్వతి, అమూల్య, వర్ష, అఖిల లక్ష్మి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.